ప్రజాశక్తి

బుధవారం 10 మే 2023 | 8 పేజీలు





ప్రకాశం | బాపట్ల

ప్రజాసమస్యల

పరిష్కార వేదికగా 'జగనన్నకు చెబుదాం'

- 365 రోజులు అందుబాటులో ఉండే వ్యవస్థ రూపకల్పన
- కలెక్టరేట్‌లో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కార వేదికగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిలుస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. స్థానిక ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్లో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారదర్శకత, జవాబుదారీతనం, విశ్వసనీయతకు మారుపేరుగా అవినీతి రహిత పాలన ప్రజలకు అందుతుందని తెలిపారు. ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్న మాదిరిగా మారుమూల ప్రాంతాలలోని అణగారిన నిరుపేద వర్గాల ప్రజల సమస్యలను సైతం పరిష్కరించడానికి గొప్ప వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి నడుం బిగించారని ▶ 3లో



మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

జగన్‌ది, దుర్యోధనుడిది ఒకటే చరిత్ర

సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ వెల్లడి

తాగునీటి సమస్యకు

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?

- నిత్యం నీటి కోసం బిందెలతో రోడ్లెక్కుతున్న మహిళలు
- కొత్త పథకాలు వచ్చే లోపే పాత పథకాలు మూతపడుతున్న వైనం
- సమృద్ధిగా సాగర్ జలాలు అందుబాటులో ఉన్నా ప్రణాళికలు లేకే సమస్య



పొదిలిలో తాగునీటి కోసం రాస్తారోకో చేస్తున్న ప్రజలు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తాగునీటి కోసం నిత్యం మహిళలు జిల్లాలో ఎక్కడో చోట బిందెలతో రోడ్లెక్కుతూనే ఉన్నారు. వేసవి రాగానే అన్ని నీటివనరులు ఎండిపోతున్నాయి. నీటి కోసం నానాతంటాలు పడాల్సి వస్తోంది. జిల్లా ఏర్పాటయినప్పటి నుంచీ ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసే దిశగా మాత్రం అధికారులు ప్రణాళికలు రూపొందించడం లేదు. ప్రజాప్రతినిధులూ పట్టించుకోవడం లేదు. కేంద్రం ఇంటింటికీ కుళాయి వేయాలని లక్ష్యం పెట్టుకుంది. ఈ కార్యక్రమం కొనసాగుతోంది. అయితే నీటిని కుళాయితో ఇంటికి ఇచ్చే సంగతి తర్వాత అసలు గ్రామాలకు గ్రామాలే నీరు లేక రవాణాపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎండలు తీవ్రమైతే సుమారు 300 ఆవాస గ్రామాలకు పైగా నీటిని ట్యాంకర్లతోనే నీటిని అందించాల్సి వస్తోంది. పట్టణాలను మినహాయిస్తే ఇప్పటికే పల్లెల్లో రోజుకు 1250 ట్రిప్పులకు పైగానే నీటిని ట్యాంకర్లతో అందిస్తున్నారంటే తాగునీటి సమస్య ఎలా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. ఏటా వేసవి రాగానే పశ్చిమాన ప్రజలు అందరికీ నీటి కోసం తిప్పలు ▶ 2లో

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడో.?

(మొదటిపేజీ తరువాయి)

తప్పడం లేదు. ఇదే సమస్య కొందరికి మాత్రం పండుగన్నట్లుగా మారింది. ఏళ్ల తరబడి పనులు చేస్తుంటారు. తాగునీటి పథకాలు నిర్మిస్తుంటారు. కొత్తవి వచ్చే లోపే పాతవి అంతర్ధానమైపోతున్నాయి. దీంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం ఎండమావిగానే మారింది. ప్రభుత్వం ఎప్పుడైతే జనానికి తాగునీరు ఇవ్వలేకపోయిందో అప్పుడే నీళ్ల వ్యాపారం తెరపైకి వచ్చింది. తాగునీటి పథకాలు ద్వారా ఇచ్చే నీరు సురక్షితం కాదనే భయం కూడా పెరుగుతోంది. సాగర్ జలాలపై ఆధారపడి పథకాలు పనిచేస్తుంటాయి. నీటిని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు తెచ్చే కాలువలు దారుణంగా మారాయి. ఈ కాలువల్లో పరిస్థితి చూస్తే ఎవరూ ఆ నీరు కూడా తాగే పరిస్థితి లేదు. నిర్వహణే అస్తవ్యస్తంగా మారింది.

ఎండుతున్న నీటి వనరులు..

వేసవి రాగానే తాగునీటి వనరులు ఎండిపోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో పిడ్ల్యుఎస్ పథకాలు 66, ఎంపీడబ్ల్యుఎస్ పథకాలు 107, డైరెక్టు పంపింగు పథకాలు 120 వరకూ పనిచేయడం లేదు. నీరు లేకనే ఆగిపోయాయి. వీటితో పాటు భూగర్భజలాలు అడుగంటడంతో 1447 బోర్లు కూడా ఎండిపోయాయి. పనిచేయడం లేదు. ఇక్కడ జనానికి తాగునీటిని ట్యాంకర్లతోనే అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు గ్రామాలకు ఎందుకు వచ్చాయనే దానిపై పాలకులు దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా ఏర్పాటై యాభై ఏళ్లుదాటింది. మళ్లీ జిల్లా పునర్విభజనలో కొత్త జిల్లా ఏర్పాటైంది. అయినా తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తం

తాగునీటి పథకాల నిర్వహణే సక్రమంగా లేదు. దీన్ని పర్యవేక్షించే గ్రామీణ నీటిసరఫరా విభాగానికి సకాలంలో నిధులు విడుదల కావడం లేదు. పథకాల పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలనే ఆలోచన కూడా చేయలేని పరిస్థితి. దీంతో భారీ తాగునీటి పథకాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. ఫ్లోరిన్ పీడిత ప్రాంతాల ప్రజలకు తాగునీటిని అందించే ఉద్దేశంతో దర్శి వద్ద నెదర్లాండు ఆర్థిక సాయంతో 1980వ దశకంలో చేపట్టిన ఎన్ఎపి పథకం కేవలం నిర్వహణ లోపంతోనే నిర్వీర్యం చేశారు. ఈ పథకం కింద ప్రారంభంలో 140 గ్రామాలకు తాగునీటిని అందించారు. ఇందుకోసం ప్రత్యేక విభాగం కూడా ఉండేది. ఇప్పుడు ఈ పథకం నుంచి సగం గ్రామాలకు కూడా నీరు పోవడం లేదు. సిబ్బంది కూడా లేరు. పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఫిల్టరు బెడ్లు కూడా సక్రమంగా లేవు. నిధుల సమస్యతోనే ఈ పథకం నిర్వీర్యమైంది. నీటి సమస్య మాత్రం లేదు. సాగర్ జలాలు ఉన్నంతకాలం దీనికి నీరు అందుబాటులో ఉంటుంది. ధూపాడు వద్ద ఉన్న పథకాల నుంచి వైపాలెం, పెద్దారవీడు ప్రాంతాలకు నీటిని అందించే పథకం కూడా ఇదే పరిస్థితి. పది గ్రామాలకు కూడా నీరు సక్రమంగా వెళ్లడం లేదు. దీంతో అక్కడ జనం రోడ్లెక్కుతున్నారు. పుల్లలచెరువు మండలం, ముటుకులలో నిర్మించిన తాగునీటి పథకం ద్వారా 40 గ్రామాలకు నీటిని అందించాలి. అయితే పథకం నిర్మాణ పనులు సక్రమంగా జరగలేదు. దీంతో కొద్ది గ్రామాలకు మాత్రమే నీరు అరకొరగా అందుతోంది. కనిగిరి ప్రాంతానికి సాగర్ జలాలు ఇచ్చే పథకాలు అన్నీ అస్తవ్యస్తంగానే మారాయి. దీంతో కనిగిరి సాగర్ జలాలు ఇప్పటికీ సక్రమంగా వెళ్లడంలేదు. పామూరు, వెలిగండ్ల పీసీపల్లి మండలాల్లో ఫ్లోరిన్ సమస్య అధికంగా ఉంది. జనం మినరల్ వాటర్ పేరుతో అక్కడ దొరికే బోర్లలోని నీటినే తాగుతున్నారు. కీడ్నీ వ్యాధుల సమస్య వీడలేదు.

సాగర్ జలాలే ప్రత్యామ్నాయం

జిల్లాలో సాగర్‌జలాలు సమృద్ధిగా ఉన్నాయి. వీటిని ఉపయోగించుకుంటే తాగునీటి సమస్య అనేదే వినిపించదు. పథకాలు చేపట్టడంలోనే వైఫల్యాలు ఉన్నాయి. కాంట్రాక్టర్ల కోసం తప్ప జనం దాహార్తిని తీర్చేలా వీటిని నిర్మించడం లేదు. మరోవైపు వెలుగొండ కూడా పూర్తవుతోంది. దీన్నుంచి 15 లక్షల మందికి తాగునీరు అందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. పథకాలు సక్రమంగా చేపడితేనే ఆ లక్ష్యం నెరవేరుతుంది. గుండ్లకమ్మ, రామతీర్థం పథకాల ద్వారానూ తాగునీటి పథకాలున్నాయి. అయినా సమస్య మాత్రం తీరలేదు. ఇప్పటికైనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రణాళికలుండాలి.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని కొండమంజులూరు గ్రామంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్న కొనుగోలు కూడా మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, కొండమంజులూరు సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మొదలైందని, ఈ కేంద్రం ద్వారా ఈ ప్రాంతంలోని మొక్కజొన్నను ప్రభుత్వ మద్దతు ధర రూ.1,920కి కొనుగోలు చేస్తామని అన్నారు. తమ పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకున్న మొక్కజొన్న రైతులంతా ఈ నెల 13వ తేదీలోపు రైతు భరోసా కేంద్ర సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకోవాలన్నారు. రైతులు తమ మొక్కజొన్న పంటను ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద అమ్ముకుంటే గిట్టుబాటు ధర వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి బాపట్ల జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు జంపని రవిబాబు, సొసైటీ అధ్యక్షులు బొప్పూడి వెంకన్న బాబు, సీఈఓ ఏల్చూరి శ్రీనివాసరావు, సర్పంచి ప్రభాకర్‌రావు, వైసీపీ నాయకుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొండమంజులూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం



సాయమందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ప్రమాద బాధితులకు మంత్రి సాయం

ప్రజాశక్తి-వేమూరు: వేమూరు నియోజక వర్గంలోని భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో విద్యుత్ షార్ట్ షార్క్యూట్ కారణంగా పూరిగృహం కాలిపోయి నిరాశ్రయులైన అమృతలూరి సౌదామణి కుటుంబాన్ని మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. అలాగే అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటనలో శరీరం 50 శాతంపైగా కాలిపోయి వైద్య చికిత్స పొందుతున్న అమృతలూరు రవిబాబు వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివి లలితకుమారి, గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, ఎంపిటిసి కౌతారపు పద్మావతి, ఉప సర్పంచ్ బుర్లే రాంప్రసాద్, నాయకులు చెన్నయ్య, మల్లేశ్వరరావు, బాలాజీ, వేల్పురి చిన్నారి, నాగేశ్వరరావు, చిన బుజ్జి, మద్దుల గిరి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవం

వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలోని మంకెనవారిపాలెంలో 8 సంవత్సరాల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు మంకెన జయరావుకు యావజ్జీవ కారాగార జైలు శిక్ష పడింది. ఒంగోలు పోస్కో రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ తీర్పు ఇచ్చినట్లు మంగళవారం జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే.. వేటపాలెంలోని మంకెనవారిపాలెంలో తన తల్లిదండ్రులతో పాటు నివాసం వుంటూ 3వ తరగతి చదువుకుంటున్న 8 ఏళ్ల వయస్సు గల మైనర్ బాలికను వారి ఇంటి సమీపంలో ఉండే మంకెన జయరావు తేది 04.01.2022న ఇంట్లోకి పిలిచి బాధితురాలిపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపేస్తాను అని బెదిరించి, కర్రతో కొట్టినట్టు, ఆ తరువాత భాదితురాలు తనపై జరిగిన లైంగిక దాడి గురించి తన చిన్నమ్మ అయిన ఫిర్యాది ఆంద్ర కిరణ్మయికి తెలియపరచగా, ఆమె బాధితురాలిని వెంటనే చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొనిపోయి, ఆ తరువాత మెరుగైన చికిత్స నిమిత్తం భాదితురాలని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లి, జరిగిన విషయం పోలీస్ వారికి స్టేట్మెంట్ ఇచ్చినది. ఫిర్యాది ఇచ్చిన స్టేట్మెంట్ మేరకు వేటపాలెం ఎస్‌ఐ జి సురేష్ 09.01.2022న కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డిఎస్‌పి పి శ్రీకాంత్ దర్యాప్తు ప్రారంభించి, భాదితురాలిని,



నిందితుడిని ఒంగోలు జైలుకు తరలించిన పోలీసులు (ఫైల్)

ఫిర్యాదిని, ఇతర సాక్షులను విచారించుకొని వారి వాంగ్మూలం నమోదు చేశారు. అత్యాచారం జరిగినప్పుడు భాదితురాలు ధరించిన దుస్తులను పోలీస్ ప్రొసీడింగ్స్ మేరకు స్వాధీన పరుచుకున్నారు. అదే రోజు నేర స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై మోపబడిన నేరం రుజువువైన అనంతరం అతడిని అరెస్ట్ చేసి అతడి ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకొని అతడిని జైలుకు పంపారు. నేర స్థలంలో నుంచి ముద్దాయి, బాధితురాలి దగ్గర నుంచి సేకరించిన భౌతిక సాక్ష్యాధారాలను నిపుణులు పరిశీలించి వారు ఇచ్చిన నివేదికను పొందుపరిచి సంబంధిత కోర్టులో ఛార్జ్‌షీట్ వేశారు. ఈ కేసును బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా పర్యవేక్షించారు. బాధితురాలికి చదువు, ఇతర అలవెన్స్‌ల నిమిత్తం రెండు లక్షల రూపాయలు ఇచ్చేవిధంగా, అలాగే ముద్దాయి చెల్లించే ఫైన్ డబ్బులు కూడా బాధితురాలికి ఇవ్వమని న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు బాలికలపై, మహిళల మీద జరుగుతున్న నేరాలను వేగంగా దర్యాప్తు చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత కోర్టులలో ఛార్జిషీట్ దాఖలు చేసి, కోర్టులో జరుగుతున్న విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ, సాక్షులకు తగిన రీతిలో భయం లేకుండా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇవ్వడం వల్లనే కేసులలో నిందితులకు శిక్షలు పడుతున్నాయన్నారు. మహిళలపై జరిగే నేరాల మీద ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కోర్టు ట్రైల్ మానిటరింగ్ జరుగుతుందన్నారు. అందువల్లనే ఏ కేసులోనూ ముద్దాయి తప్పించుకొనే ఆస్కారం లేకుండా బలమైన సాక్ష్యాలను న్యాయస్థానం ముందు ఉంచగలుగుతున్నామన్నారు. మహిళల మీద, బాలికల మీద చెడు ఉద్దేశంతో ప్రవర్తించేవారిని ఉపేక్షించేది లేదని తెలిపారు. కేసు దర్యాప్తు వేగవంతంగా చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, భౌతిక సాక్ష్యాధారాలను కోర్టు వారికి సమర్పించి, కేసు నమోదు చేసిన సంవత్సర కాలంలోనే ముద్దాయికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పిపిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈ నెల 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కమిషనర్ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ టీజే చంద్రశేఖర్‌బాబు తెలిపారు. అంతేగాక ఈ ప్రత్యేక తరగతులకు విచ్చేసే విద్యార్థులకు, ప్రిన్సిపాల్ సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయడమైందన్నారు. ఈ అవకాశాన్ని ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యే ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ బాబు తెలిపారు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపిపి, జెడ్పిటిసి

విద్యార్థులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-వేమూరు

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని ఎంపిపి డివి లలితకుమారి సూచించారు. భట్టిప్రోలు మండలంలోని పెసర్లంక డికె ఉన్నత పాఠశాలలో పది పరీక్షలలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. మండల ద్వితీయ స్థానంలో 559/600 సాధించిన పట్టపు అఖిల పాఠశాల ద్వితీయ స్థానంలో 524 మార్కులు సాధించిన భార్గవి, కార్తికేయలను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించటానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె బాషా, ఇతర ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం నాడు నేడు పనులలో భాగంగా నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి చంటి, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ ఉన్నారు.

పరిష్కార వేదికగా 'జగనన్నకు చెబుదాం'

(మొదటిపేజీ తరువాయి)

ఆయన తెలిపారు. జగనన్నకు చెబుదాం వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా విన్నారనే భావన కల్పించేలా వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ఫిర్యాదు చేసిన వారు ఇకనుంచి ధైర్యంగా ఉండవచ్చని, ప్రభుత్వం పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందన్నారు. 365 రోజులూ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యవస్థకు ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని కితాబిచ్చారు. ఫిర్యాదులను పరిష్కరించడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, అన్ని హోదాలలోని అధికారులు సమన్వయంతో పనిచేసేలా యూనిట్ ఏర్పాటైందన్నారు. ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కరించడానికి ప్రతి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహించడం రాష్ట్రంలో ఇదే ప్రథమమన్నారు. ఎక్కడా లేనివిధంగా ప్రకాశం జిల్లాలోనే స్పందన కార్యక్రమాలు విస్తతంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారంలో సంతృప్తిస్థాయి నూరు శాతం ఉండేలా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. జవాబుదారీతనంతో జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన వివరించారు. ప్రజలలో విశ్వసనీయత కల్పించడం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్తామన్నారు. పశ్చిమప్రకాశంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని మంత్రి సురేష్ వివరించారు. వాటర్ గ్రిడ్‌లో రూ.1,400 కోట్లతో కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలలో తాగునీటి కోసం పనులు జరుగుతున్నాయన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య శాశ్వతం పరిష్కారమవుతుందన్నారు. ప్రజల అవసరాలకు యర్రగొండపాలెంలో విస్తతంగా బోర్లు వేశామన్నారు. తాగునీటి రవాణాకు సంబంధించిన అనుగుణంగా బిల్లులు మంజూరయ్యేలా ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తామన్నారు. సుమారుగా రూ.132 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల అయ్యేందుకు కషి చేస్తామన్నారు. రూ.75 కోట్ల బిల్లులు వారంలో మంజూరవుతాయన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో తాగునీటి దాహార్తి తీర్చడానికి రూ.330 కోట్లతో అమత్ ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయన్నారు. ఒంగోలులో నీటి రవాణాకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు

ప్రభుత్వ సేవలు ప్రజలకు దగ్గర చేయడానికి కలెక్టరేట్ లో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేశామని జిల్లా అభివద్ధి, సంక్షేమ పథకాల ప్రత్యేక అధికారి ఎంటి.కష్ణబాబు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించడానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఫిర్యాదుదారుని సమక్షంలోనే సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రజల సంతప్తి స్థాయి 100 శాతం పెరగడానికి ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యంగా వ్యవస్థ పనిచేస్తుందన్నారు.

జగనన్నకు చెబుదాం మెరుగైన విధానం

ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మెరుగైన విధానమని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించగా రెవిన్యూ, పంచాయతీ, పోలీసు, గ్రామ, సచివాలయాలు, స్థానిక సంస్థల నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 24 గంటలలోనే వాటిని పరిష్కరించడానికి జిల్లా స్థాయిలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో కలెక్టర్, సంయుక్త కలెక్టర్, ఉప కలెక్టర్లు పనిచేస్తారని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు క్రమపద్ధతిలో నాణ్యత ప్రమాణాలతో సమస్యలు పరిష్కారానికి అధికారుల బందం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు నిరంతరం పరిశీలన, పర్యవేక్షిస్తారని వివరించారు. గతంలో పరిష్కారమైనట్లుగా చూపిన అర్జీలే 75 శాతం మరోసారి పునరావతం అవుతున్నాయన్నారు. మండల స్థాయిలో ఆడిట్ టీంను ఏర్పాటు చేశామన్నారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీ, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు మండలస్థాయి యూనిట్‌లో ఉంటారని, మండల స్థాయిలో పరిష్కారమైన వాటిని ఆర్డీవోలు పర్యవేక్షిస్తారన్నారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎస్‌పి మలికగర్గ్, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత నాయకులు

చేనేత సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి-చీరాల

చేనేత రంగం ఎదుర్కొంటున్న అధిక ధరలు, నూలు, రంగులు, రసాయనాలు, మార్కెట్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని చేనేత సంఘాలను ఒకే చోటికి చేర్చి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాలని చేనేత నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో చేనేత సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ నెల 18న రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం చీరాల అంబేద్కర్ భవన్‌లో జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలోని చేనేత సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మాచర్ల మోహనరావు, శీలం వెంకటేశ్వర్లు, పి కొండయ్య, మేడా వెంకట్రావు, గుద్దంటి ఆదిలక్ష్మి, తారక రామారావు, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'పెదపులివర్రు' జోష్

ప్రజాశక్తి-వేమూరు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పెదపులివర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు భట్టిప్రోలు మండల ప్రథమ స్థానం లభించిందని ఎంఇఓ పులి లాజర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదపులివర్రు పాఠశాల విద్యార్థికి 573/600 మార్కులతో ప్రథమ స్థానం, పెసర్లంక డికె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థికి 559/600తో ద్వితీయ స్థానం, పల్లెకోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 558/600తో తృతీయ స్థానం లభించిందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తోడ్పాటునందించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎన్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించు కోవాలని సూచించారు. ఈ విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, వినిపించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలను గ్రంథాలయాల కు తల్లిదండ్రులు పంపించాలని కోరారు. పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు: ఎంపిపి

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపీపీ బాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక శాఖలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందాలని, వైద్య శాఖకు బాజీ సూచించారు. ఇప్పటి వరకు ఎలా జరిగింది అనేది కాకుండా ఇప్పటి నుంచి తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సచివాలయంలో 11కు గాను 10 మంది వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న పిట్టలవానిపాలెం ఎంపిపి బాజీ

నియమించటం ఒక శుభపరిణామమని అన్నారు. అత్యవసర చికిత్సలకు సంబంధించి పూర్తి స్థాయిలో వైద్య సేవ ఛందోలు పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్నాయని వైద్య సిబ్బంది తెలిపారు. దోమల నివారణకు కావాల్సిన ఏబట్ తదితర సంబంధిత ద్రావణాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గ్రామ పంచాయతీలకు కావాల్సిన వరకు తాము అందచేయడానికి సిద్ధంగా ఉన్నామని వైద్య శాఖ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రామరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ పద్మజ, తహశీల్దార్ కవిత, పశువైద్యులు తిరుమల తేజ, సీడీపీఓ శైలజ, నాయకులు ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

పేదల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి-బాపట్ల

పేద ప్రజల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో బాపట్లలో ఆరంభించిన అన్న క్యాంటీన్ 191వ రోజుకు చేరింది. మంగళవారం వేగేశన నరేంద్రవర్మ సహకారంతో 350 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న యు దేవపాలన

జెవివి వేసవి శిక్షణ

ప్రజాశక్తి-అద్దంకి: జన విజ్ఞాన వేదిక ఎన్‌టిఆర్ కళాశాలలో సమ్మర్ క్యాంప్‌లో మంగళవారం జానపద కళాపీఠం అధ్యక్షుడు యు దేవపాలన, కార్యదర్శి జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు. జానపదం అంటే జనాలలో నుంచి ఉద్భవించిందని, ఇటీవల ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఆస్కార్ అవార్డు వచ్చిన, 'నాటు నాటు' పాట జానపదం పాటని, బుర్రకథ, తోలుబొమ్మలాట, డప్పు విన్యాసాలు, కోలాటం, డోలు సన్నాయి వాయిద్యాలు మొదలగునవి జనాలను సినిమా ప్రపంచం విస్తరించకముందు, గ్రామాలలో ప్రజలను ఊర్రూతలు ఊగించేవని విద్యార్థులకు వివరించు జరిగింది, జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ 7వ శతాబ్దంలోనే అద్దంకి చరిత్ర కోటకట్లలో బయటపడిందని చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి డివిజన్ కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, హెూమియో రఘుచంద్, లేవి ప్రసాదు, తంగిరాల వెంకటేశ్వర్లు, కె కోటేశ్వరకుమార్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు ఇదే..

ప్రమాదకరంగా కల్వర్టు

ప్రజాశక్తి-సంతమాగులూరు: మండలంలోని పాతమాగులూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో హైవే రహదారి, అండర్ పాస్ కింద ప్రవహించే చెరువు కాలువ వద్ద ప్రమాదం పొంచిఉంది. అయినా సంబంధిత అధికారులు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అండర్ పాస్ వద్ద ఉన్న కల్వర్టుపై ఎటువంటి సిమెంట్ గోడలు లేనందున రహదారిలో మార్జిన్‌లో దిగిన ఆటోలు, కార్లు, కాల్వలో బోల్తా పడుతున్నాయి. గతంలో నరసరావుపేట నుంచి ప్రయాణికులతో సంతమాగులూరు వైపు వెళుతున్న ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, ఇదే స్థలంలో అండర్ పాస్ కాలువ ఉందని తెలియక రోడ్డు మార్జిన్‌లోకి దిగడంతో ఆటో అదుపుతప్పి కాల్వలో పడడంతో కొందరు మృతి చెందగా, మరికొందరు క్షతగాత్రులైన ఘటనలు ఉన్నాయి. ఈ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ పెరగడంతో ఈ కల్వర్టు వద్ద ఎప్పుడు ఎలాంటి సమస్యలు ఎదురవుతాయోనని, కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకి ఇరువైపులా ఉన్న కల్వర్టుపై సిమెంట్ గోడలు నిర్మించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అంధులకు వెలుగు రావూరి ఫౌండేషన్

16 వేల మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు ● సేవా కార్యక్రమాలలో మేటి రావూరి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పరిసర ప్రాంతాలలో రావూరి వెంకటసుబ్బయ్య పేరు తెలియనివారు లేరంటే అతిశయోక్తి కాదు. 1983వ సంవత్సరానికి ముందు ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమాలలో ఆయన ముందుండేవారు. కమ్యూనిస్టు పార్టీ విభజన సమయంలో పక్కకు వచ్చిన రావూరి వెంకటసుబ్బయ్య అప్పటి నుంచి కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుడుగా ఉన్నారు. వెంకటసుబ్బయ్య మనుమరాలు రావూరి వినీల చిన్న వయసులోనే మరణించారు. ఈ నేపథ్యంలో టంగుటూరులో రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలను వెంకటసుబ్బయ్య నిర్వహిస్తూ వచ్చారు.

సేవా కార్యక్రమాలతోనే ఆత్మ సంతృప్తి

దేవుడిచ్చిన సంపాదనలో కొంత భాగం నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని వెంకటసుబ్బయ్య చెబుతూ ఉండేవారు. రావూరి వినీల జయంతి, వర్ధంతి సందర్భంగా ఇప్పటికీ ఉచిత మెడికల్ క్యాంపుల ద్వారా వేలాది మంది నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. చూపు మందగించిన అనేకమందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అదే విధంగా ఇప్పటివరకూ కంటి ఆపరేషన్లు అవసరమైన దాదాపు 16 వేల మంది నిరుపేదలకు మోడరన్, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రులలో కంటి శుక్లం ఆపరేషన్లు చేయించి కంటిచూపు ప్రసాదించిన దాతగా రావూరి వినీల ఫౌండేషన్ చైర్మన్ రావూరి వెంకటసుబ్బయ్య టంగుటూరు, పరిసర ప్రాంతాలలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. అనేకమంది వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, దుస్తులు, పుస్తకాలు అందించడం, జిల్లాలోని పలు ప్రాంతాలలో బస్ స్టేషన్‌ల వద్ద అదనపు బస్ షెల్టర్ల నిర్మాణం తదితర సేవా కార్యక్రమాలను రావూరి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా టంగుటూరులో రాజీవ్ నగర్ ఏర్పాటులో ప్రధాన పాత్ర రావూరి వెంకటసుబ్బయ్యది. రాజీవ్‌నగర్ ఏర్పాటు సమయంలో భూ కేటాయింపు, పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు సమయంలో రావూరిది ప్రత్యేక పాత్ర. 'పేదలకు ఇంటి స్థలం దక్కింది కదా.. తన పని అయిపోయింది' అనుకోకుండా రాజీవ్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించే వరకూ పంచాయతీ, సంబంధిత అధికారులతో పోరాటం చేసి మరీ రాజీవ్ నగర్ సమస్యల పరిష్కారానికి వెంకటసుబ్బయ్య కృషి చేశారు. ఒంగోలు పొగాకు సర్వే సొసైటీ డైరెక్టర్‌గా కొంతకాలం పనిచేసిన రావూరి వెంకటసుబ్బయ్య టంగుటూరు మండల తెలుగు రైతు కన్వీనర్‌గా కూడా పనిచేసి రైతులకు గిట్టుబాటు ధరలు, నష్టపరిహారం పంపిణీ తదితర సమస్యల పరిష్కారంలో టంగుటూరు పరిసర ప్రాంత రైతులు రావూరి వెంకటసుబ్బయ్య కృషిని ఇప్పటికీ మరువలేరనడంలో అతిశయోక్తి లేదు.



టంగుటూరులో ఉచిత కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలు, వికలాంగురాలికి ట్రై సైకిల్ అందజేస్తున్న రావూరి, రావూరి వినీల ఫౌండేషన్ సౌజన్యంతో కందుకూరులో నిర్మించిన అదనపు బస్ షెల్టర్ (ఇన్‌సెట్‌లో) రావూరి వెంకటసుబ్బయ్య

ఈ సేవా కార్యక్రమాలతో రావూరి వెంకటసుబ్బయ్య ఆశయాలను నిరంతరం సక్రమంగా నిర్వహించడమే ఆయనకు తాము ఇచ్చే నిజమైన నివాళి అని రావూరి తిరుమల రాధాకృష్ణ, వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పరివర్తనా భవనం పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరులో జరుగుతున్న పరివర్తనా భవన పనులు సత్వరం పూర్తి చేసి నియోజకవర్గంలోని దళితులంతా ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్ కోరారు. పర్చూరులో నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఆయన పరిశీలించారు. కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం సహకారంతో భవనం నిర్మాణ పనులు ప్రారంభించినట్లు కమిటీ సభ్యులు వివరించారు. నిధుల లేమి కారణంగా పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదని చెప్పారు. ఇటీవల కేంద్ర మాజీ మంత్రి సునజా చౌదరి రూ.10 లక్షలు ప్రహరీ గోడ నిర్మాణానికి, బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగం సురేష్ రూ.5 లక్షలు ఫ్లోరింగ్‌కు కేటాయించారన్నారు. మంజూరైన నిధులతో త్వరగా పనులు పూర్తి చేయాలని, అవసరమైతే సంబంధిత అధికారులతో మాట్లాడతామని విక్టర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. ముందుగా పర్చూరు బొమ్మల సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన వెంట మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జూపూడి మార్కు, స్వరాజ్, ఆనంద్, ఎన్ కిషోర్, ఎస్ఐ చెంచు ప్రసాద్ తదితరులు ఉన్నారు.



పర్చూరులో పరివర్తనా భవనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నాట్య ప్రదర్శనలో అవంతిక ప్రతిభ

న్యాయవాదుల ఆధ్వర్యంలో సన్మానం

ప్రజాశక్తి-మార్కాపురం

ఇటీవల మలేషియా రాజధాని కౌలలంపూర్ నగరంలో జరిగిన భరతనాట్య ప్రదర్శనలో మార్కాపురానికి చెందిన స్నేహ సంగీతా నాట్య అకాడమీ విద్యార్థి భూపని శ్రీ అవంతిక, గురు ప్రతిమ సునీల్ పర్యవేక్షణలో అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా చిన్నారి అవంతికకు మలేషియాలో భారత రాయబారి సి సుష్మ చేతుల మీదుగా సన్మానం చేసి మెమెంటోను అందజేశారు. అవంతిక మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ భూపని కాశయ్య కుమార్తె. మలేషియాలో భరత నాట్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి మార్కాపురం వచ్చిన సందర్భంగా మంగళవారం అవంతికకు పట్టణ ఎపిపిలు ఆర్ బాలు నాయక్, డి గాంధిరెడ్డి, న్యాయవాదులు ఎం సత్యనారాయణ, వై వెంకటేశ్వరరెడ్డి, అనిల్ కుమార్, రామకృష్ణ, పురుషోత్తం నాయక్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఉప సర్పంచ్ గురు బ్రహ్మంలు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.



చిన్నారి అవంతికను అభినందిస్తున్న న్యాయవాదులు

పంట నష్టపరిహారం చెల్లించాలి: నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్రంలో గత పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్ర వర్మ కోరారు. మంగళవారం బాపట్ల తహశీల్దారు చిన్నం సుధారాణికి వినతిపత్రం పార్టీ నాయకులతో కలిసి నరేంద్రవర్మ అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో పంటలు నీటిలో నాని నష్ట తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. వరిధాన్యంతో పాటు మిరప, మొక్కజొన్న, పసుపు, శనగ, వేరుశనగ, మామిడి, అరటి, ఇతర ఉద్యాన పంటలు బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి దెబ్బతిని రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. పంట నష్టం అంచనా వేసి త్వరితగతిన పరిహారం అందించాలని పేర్కొన్నారు. నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతుకు ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం అందజేయాలన్నారు. ఈ మేరకు తహశీల్దారుకు వినతిపత్రం అందజేశామని, కార్యక్రమంలో మానం విజేత, జిట్టా ప్రమీల రాణి, పమిడి భాస్కరరావు, చుండూరుపల్లి శివ, నక్కల వీరరాఘవయ్య, గొలపల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న నరేంద్రవర్మ

సమరయోధుల చరిత్రను తీసేయడం దుర్మార్గం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

భారతదేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొని ప్రాణాలర్పించిన స్వతంత్ర సమరయోధుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుండి కేంద్ర ప్రభుత్వం తీసివేయడం దుర్మార్గమైన చర్యని ఎంపీజే రాష్ట్ర కేశాధికారి షేక్ అబ్దుల్ రజాక్ మండిపడ్డారు. విద్యావ్యవస్థను కాషాయీకరణ చేయడమే తమ లక్ష్యంగా చేసుకొని బిజెపి ప్రభుత్వం పావులు కలుపుతుందని ఇలాంటి చర్యలను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయం నందు ఉప కలెక్టర్ సేతుమాధవన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీజే నాయకులు షేక్ అమీర్ భాష, షేక్ షఫీ, రసూల్, కరీముల్లా, అమానుల్లా, కరీం భాషా, సుభాని తదితరులు పాల్గొన్నారు.

'శ్రీసాధన'లో అంతర్జాల సదస్సు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో "ఆర్థిక సాధికారత-ఫైనాన్షియల్ అండ్ సెక్యూరిటీస్ మార్కెట్ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు' అనే అంశంపై జాతీయ స్థాయి అంతర్జాల సదస్సు మంగళవారం జరిగింది. ప్రధాన వక్తగా సెబి మాజీ డిజిఎం, ఎఎంఎఫ్ఐ సీనియర్ కన్సల్టెంట్ సూర్యకాంత్‌శర్మ మాట్లాడుతూ స్థిరమైన నష్టం భయం లేని ఆదాయం కావాలంటే ప్రభుత్వ పథకాలైన ఎన్‌పిఎస్, కిసాన్ వికాస్ పత్రం గోల్డ్ సావరీస్ స్కీమ్ వంటివి పరిశీలించాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ కప్పుగంతుల మధుసూదన్ నేతృత్వంలో జరిగిన ఈ జాతీయ అంతర్జాల సదస్సును ప్రారంభిస్తూ ఉప ప్రధానాచార్యులు పికెవియు శ్రీధర్‌కుమార్ మాట్లాడారు. కళాశాల పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శేషుకుమార్ వందన సమర్పణ గావించారు. కార్యక్రమంలో జాతీయ సదస్సు కన్వీనర్స్, కామర్స్ అధ్యాపకులు ఓ.ఏడుకొండలు, కళాశాల ప్రాంగణ విభాగాధిపతి కెవిఎస్ పవన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమీషనర్ భవాని

గిరిజన గూడేలు సందర్శించిన డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని గిరిజన గూడేలైన తుమ్మలబైలు, చింతల, మర్రిపాలెంలను మంగళవారం రూరల్ డెవలప్‌మెంట్ కమీషనర్ నారాయణరెడ్డి, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ప్లాంటేషన్ భవాని సందర్శించారు. మామిడి, చీని తోటలు పెంచుతున్న చెంచు గిరిజనులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకొని కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం నంద్యాల జిల్లా పరిధిల్లో బైరుట్లీ, నాగతోటి గూడెంలలో వ్యవసాయ పొలాలు సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఉపాధి పనులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఏ పీవో బి రవీంద్రారెడ్డి, టిం ప్రత్యేక అధికారి కెజి నాయక్, కొండా నాయక్, సుధీర్, అన్వరాబేగం తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లు అందజేస్తున్న మంత్రి సురేష్

క్రికెట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

షార్డ్స్ సంస్థ సహాయ సహకారాలతో యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని 40 గ్రామాలలో యువతకు వేసవి సెలవులు సందర్భంగా క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమం పుల్లలచెరువు మండలం మల్లాపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ద్వారా మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, ఎంఈవో సామ్యూల్ జాన్, షార్డ్స్ సంస్థ ప్రతినిధి మందా మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవమయ్యేలా చూడాలి

ఎంపీపీ కడప లక్ష్మి

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీలు సుఖ ప్రసవం అయ్యేట్లు చూడాలని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. మండలంలోని సంజీవరావు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన హాస్పిటల్ అభివద్ధి కమిటీ సమావేశం ఆమె మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందుబాటులోకి తెచ్చారని, అందులో భాగంగానే వైద్యరం గంలో కూడా భారీ సంస్కరణలు తీసుకువచ్చి 108, 104, విలేజ్, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఫామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా కషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ప్రధానమంత్రి సురక్షిత్ మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుమయ ఆద్వర్యంలో 65 మందికి ఉచిత వైద్య రక్త పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదనరావు, సంజీరావుపేట సర్పంచ్ ఓబులమ్మ, మాజీ ఎంపిపి కడప వంశీరెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ షేక్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కడప లక్ష్మి

'మలబార్'లో థీం సాంగ్ సందడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బంగారు ఆభరణాల సంస్థ తమ ప్రచార కార్యక్రమం 10వ ఎడిషన్‌లో 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా-2023' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఒక కొత్త థీంసాంగ్‌ను రూపొందించి మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీనికి ప్రముఖ బ్రాండ్ అంబాసిడర్‌లుగా అలియాభట్, అనిల్ కపూర్‌లతో పాటు దేశంలోని విధ ప్రాంతాల నుంచి వధువులతో 'షోదవే' అనేపేరుతో థీం సాంగ్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని మలబార్ బ్రాంచి కార్యాలయంలో మంగళవారం ఆ 'థీంసాంగ్'ను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా -2023' వెడ్డింగ్ థీం సాంగ్ షోదివే ప్రచార కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోందని అశోక్ కుమార్ తెలిపారు.



థీం సాంగ్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం



ఆలయంలో జడ్జి, కుటుంబసభ్యులు

హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండల కేంద్రమైన త్రిపురాంతకంలో ప్రసిద్ధి గాంచిన, పుణ్యక్షేత్రమైన శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీమత్ బాలా త్రిపురసుందరీ దేవి ఆలయాలను మంగళవారం హైకోర్టు జడ్జి పివి జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చెంచుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల మండలాల పరిధిలోని చెంచు గూడేల పరిధిలో సమస్యలు పరిష్కరించాలని ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె వెంకట మురళికి చెంచు గిరిజన పెద్దలు మంగళవారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చెంచు సంఘం నాయకులు బి వెంకటేశం, యం మల్లయ్య, కె పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉంటారా..? వెళ్లిపోతారా.?

- మరో పదిరోజుల్లో ముగియనున్న కమిషనర్ డిప్యూటేషన్ గడువు
- కొనసాగింపుపై ఇంకా స్పష్టత కరువు
- తాజా పరిణామాలతో ఉన్నతస్థాయిలో కమిషనర్‌కు ఎదురు దెబ్బ
- ఆయన వ్యవహారంపై ఉద్యోగులు, కార్పొరేటర్లలోనూ భిన్నాభిప్రాయాలు



ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలకసంస్థ ప్రస్తుత కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు డిప్యూటేషన్ కాలం ఈ నెల 20తో ముగియనుంది. ఆయన డిప్యూటేషన్ కాలాన్ని పొడిగిస్తారా..? లేక మరెవరినైనా కమిషనర్‌గా నియమిస్తారా..? అనే చర్చ కార్పొరేషన్ వర్గాల్లో తీవ్రంగా నడుస్తోంది. బిసి కార్పొరేషన్ ఈడిగా ఉన్న వెంకటేశ్వరరావును ఏడాది పాటు డిప్యూటేషన్‌పై నియమించారు. అప్పట్లో మంత్రిగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి ఏరికోరి ఈయన్ను ఎంపిక చేశారు. రాజకీయ నేతల సిఫార్సుల మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధికారులు ఎంపిడిఒ హోదా కలిగిన వెంకటేశ్వరరావును తీసుకొచ్చి కమిషనర్ కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ ఏడాది కాలంలో ఈయన ద్వారా అధికాపార్టీకి నగరంలో వచ్చిన మైలేజీ ఏంటనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. దీనిపై అధికార వైసిపిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఉద్యోగుల్లో మాత్రం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డికి వెంకటేశ్వరరావు నమ్మిన బంటుగా ఉంటున్నారని చెబుతున్నారు. ఇదే నమ్మకాన్ని ఆయన కార్పొరేషన్ పాలకవర్గ పెద్దల వద్ద నిలుబెట్టుకోలేదని ప్రచారం జరుగుతోంది. మేయర్, కమిషనర్‌ల మధ్య వివిధ విషయాల్లో నిత్యం విభేదాలు చోటుచేసుకుంటున్నాయి. వారి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటోంది. వారిద్దరి మధ్య ఎందుకంత గ్యాప్ వచ్చిందనే చర్చ కూడా పాలకవర్గంలో కీలకంగా ఉన్న కార్పొరేటర్లకు కూడా అంతుపట్టడం లేదు. నిత్యం ఒకరిమీద ఒకరు అంతర్గత విమర్శలు చేసుకుంటున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఇక ఏదైనా పని కోసం కార్యాలయానికి వెళ్లిన కార్పొరేటర్లతో సక్రమంగా మాట్లాడకపోవడం, వారిని సంతృప్తిపరిచేలా ఆయన సమాధానం ఉండక పోవడం కొంతమంది కార్పొరేటర్లు జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం. ఇక సాధారణ ప్రజలకు ఆయనిచ్చే సమాధానం చాలా కరువుగా ఉంటుందని తెలిసింది. ప్రజలతో సత్సంభందాలు నెరిపే విషయంలో కమిషనర్‌కు వెనుకబడ్డారనే ప్రచారం జరుగుతోంది. ఇక ఆఫీసు ఉద్యోగులు ఏదైనా ఫైల్ తీసుకువెళితే దాన్ని రోజుల తరబడినాన్చడం, కనీసం ఇంక్రిమెంట్ ఫైల్స్ సైతం సంతకాలు పెట్టకుండా తిప్పుకోవడం ఉద్యోగులను బాధిస్తోంది.

ఇక పరిపాలనలో భాగమైన సచివాలయాలను ఆయన నిత్యం తనిఖీలు చేస్తున్నారు. కమిషనర్ ఏ సచివాలయానికి వెళ్లినా ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడటం, ప్రభుత్వ సర్వేలు, నగరపాలక సంస్థ పన్నుల వసూళ్లే ప్రాధాన్యత అంశాలుగా వారిమీద విరుచుకు పడుతుండటం సచివాలయ ఉద్యోగులకు మింగుడు పడటం లేదు.

కార్పొరేషన్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. దీన్ని గాడిలో పెట్టాల్సిన కమిషనర్ పెద్దగా ఈ వ్యవహారాలేవీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈయన కమిషనర్‌గా వచ్చిన తరువాత కార్పొరేషన్‌లో అవినీతి పెరిగిందే తప్ప తగ్గిందేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏడాది కాలంలో వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే వద్ద మంచి మార్కులు తెచ్చుకున్నా.. కార్పొరేషన్ పాలకవర్గం వద్ద అత్తెసరు మార్కులే తెచ్చుకున్నారని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈయన డిప్యూటేషన్ కొనసాగిస్తారా.? లేదా..? అనే చర్చ జోరందుకుంది. తనను కొనసాగించాలని వెంకటేశ్వరరావు ఈ పాటికే ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారని తెలిసింది. అయితే ఒంగోలులో ఇటీవల జరిగిన ఓ పరిణామం ఆయనకు మైనస్‌గా మారినట్లు సమాచారం. ఒంగోలులో వేసవిలో ప్రజల దాహర్తి తీర్చడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ అధికారిక కార్యక్రమం కోసం వేసిన ఫ్లెక్సీలలో సిఎం, సంబంధిత శాఖ మంత్రి ఫొటోలు లేకపోవడం దుమారాన్ని రేపాయి. వైసిపి అధిష్టానం వ్యవహరిస్తున్న తీరుకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న బాలినేనికి ఈ విషయం ఓ షాక్‌గా తయారైంది. దీంతో చలివేంద్రాల ప్రారంభ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. ఎప్పుడు ప్రారంభిస్తారన్నది ఇప్పటికీ స్పష్టత లేదు. సాధారణంగా అధికారిక ప్లెక్సీలు ఏమైనా ఏర్పాటు చేసేటప్పుడు కమిషనర్ లేదా, సంబంధిత సెక్షన్ హెడ్‌గా ఉన్న వ్యక్తికి ప్రూఫ్‌లు చూపించిన తరువాతే ముద్రిస్తారు. అయితే చలివేంద్రాల కాంట్రాక్టర్‌కు తెలియక ప్రోటోకాల్ విషయంలో తప్పుచేశారని మేయర్, కమిషనర్ వివరణ ఇచ్చారు. ఈ విషయంపై జిల్లాకే చెందిన మంత్రి కూడా సీరియస్‌గా ఉన్నారని సమాచారం. ఇటీవల కొప్పోలు వద్ద పోతురాజు కాలువపై నిర్మించిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) ఓపెనింగ్ సందర్భంగా కూడా అధికారులు మంత్రికి తగిన గౌరవం ఇవ్వలేదనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కమిషనర్ డిప్యూషన్ పొడిగింపు వ్యవహారంలో మంత్రి ఎలా వ్యవహరిస్తారన్న చర్చ కూడా జోరుగా జరుగుతోంది. వెంకటేశ్వరరావు మాత్రం తననే ఎలాగైనా కమిషనర్‌గా కొనసాగించాలని తన సన్నిహితుల ద్వారా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వద్ద ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతిమంగా బాలినేని శ్రీనివాసరెడ్డి అనుకున్నదే జరగడానికి అవకాశం ఉన్నా.. కమిషనర్ ఈ ఏడాది పాలనలో నగరంలో ఏం సాధించారన్న దానిమీద వివిధ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దేవాదాయ భూముల కౌలు వేలం

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని నందనవనం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూములకు ఈ నెల 10న దేవాలయం వద్ద కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాదికారి డి.రజనీకుమారి తెలిపారు. కౌలు వేలంపాట ఒక సంవత్సరానికి మాత్రమే జరుపబడునన్నారు. షరతులు వేలం పాటకు ముందుగా తెలుపుతామని చెప్పారు. బడతుందని ఈఓ తెలిపారు.

మండలంలోని పైడిపాడు గ్రామంలో వేంజేసియున్న శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం భూ హక్కు కలిగిన భూములకు కౌలు వేలం బుధవారం నిర్వహించనున్నట్లు దేవాలయ కార్య నిర్వహణాదికారి రజనీకుమారి తెలిపారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం మండలంలోని స్వయంసహాయక సభ్యులకు లోకోస్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల వివరాలన్నీ లోకోస్ యాప్‌లో సభ్యుల వివరాలు, సంఘం వివరాలు, గ్రామ సంఘ వివరాలు అన్నీ కూడా ఈ లోకోసు యాప్‌లో నమోదు చేయాలని ఎపిఎం కె.గోపాలకష్ణ తెలిపారు. రెండు రోజులు ఈ యాప్ పైన గ్రామ సంఘ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ యాప్ పైన ఏపిఎం కె.గోపాలకష్ణ, సిసిలు రాజయ్య, రామయ్య, విఓఎలు నాగేశ్వరి, కోటేశ్వరి, శారదలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ నాగభూషణం, స్త్రీనిధి మేనేజర్ సులోచన, గ్రామ సంఘ అసిస్టెంట్లు, అకౌంటెంట్‌లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక వైకేపీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న లోకోస్ యాప్‌పై ఏపీఎం జి.వెంకటేశ్వర్లు వీవోఏలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకోస్ యాప్‌లో మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రతి గ్రూప్ సభ్యుల ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఇన్సూరెన్స్, ఫోన్ నంబర్ మొదలైన సమగ్ర సమాచారం తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. మండలంలోని 1067 మహిళా గ్రూపులు, 34 గ్రామ సంఘాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయి వంటి సమగ్ర సమాచారం వీఓఏలు అడిగిన వెంటనే అందించాలంటూ ఏపీయం తెలిపారు. సమావేశంలో సీసీలు ప్రసన్నకుమార్, ఆంజనేయులు, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పశు వైద్య' అంబులెన్సులు ఎక్కడ.?

ప్రజాశక్తి-కొమరోలు

మండలంలోని ముత్రాసుపల్లి గ్రామ సమీపంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై గేదెల మందను కారు ఢీకొంది. ఈ ఘటనలో నాలుగు గేదెలు అక్కడికక్కడే మతి చెందారు. మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదంలో గాయపడ్డ వారిని పోలీసులు ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. తీవ్రంగా గాయపడిన మూగజీవాలను పట్టించుకున్న నాథుడే లేడు. అక్కడికి ప్రమాద స్థలంలో ఉన్న అధికారులు సంబంధిత అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించారు. ఆ అధికారులు ఎవరూ కూడా ఈ సమయంలో చేసేదేమీ లేదని చెప్పినట్టు సమాచారం.. మరి పశువుల కోసం ఏర్పాటుచేసిన అంబులెన్సులు ఏమయ్యాయి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పశువులకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. మరి పశు వైద్య శాఖ అధికారులు ఈ ఘటనపై ఏ విధంగా స్పందిస్తారో.? చూడాలి.

1902 టోల్‌ఫ్రీను ఉపయోగించుకోండి

ప్రజాశక్తి-దరిశి

ప్రతి సంక్షేమ పథకం కోసం అర్హులైన ప్రజలందరూ సమస్యలు ఉంటే 'జగనన్నకు చెబుదాం' 1902 టోల్‌ఫ్రీ నెంబరు ఉపయోగించుకోవాలని డిఎల్‌పిఒ గుత్తా శోభన్‌బాబు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంలో భాగంగా టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్ఇబి సిఐ సుందరరామయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలలో ఉన్న సమస్యలను ప్రభుత్వానికి 1902 టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో ఎఒ జాన్సన్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని మార్కాపురం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ రాష్ట్ర సంఘం అడ్వైజర్ కమిటీ సభ్యులు మరియు మార్కాపురం డివిజన్ సంఘం అధ్యక్షులు సయ్యద్ సుభాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తపాలశాఖ ఎన్ ఎఫ్ పి ఈ, ఏఐపిఈ యు, గ్రూప్ సి సంఘాల గుర్తింపు రద్దు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోస్టల్ యూనియన్ నాయకులపై వేధింపులు మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఫోర్ సెక్రెటరీ ఐ.శంకర్ ప్రసాద్, జిడిఎస్ యూనియన్ సెక్రెటరీ వి మణికుమార్, పిత్రీ అసిస్టెంట్ సెక్రటరీ హర్షద్ ఖాన్, యూనియన్ నాయకులు అల్లం రవి, వై. సుకుమార్, ఎం.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం బాధితుల జాబితాను మార్చాలి

కలెక్టర్‌కు దళిత నేత నీలం నాగేంద్రరావు వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నీలం నాగేంద్రరావు

జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఆమోదించిన భీమవరం బాధితుల జాబితాని మార్చాలని మరో 14 మంది వారసులకి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ దినేష్ కుమార్‌ను దళితనేత నీలం నాగేంద్రరావు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిసిన నీలం మాట్లాడుతూ భీమవరం భూ సాధన కమిటీ నాయకులతో కలిసి భీమవరం బాధితులకు ఇచ్చిన భూమి పంపిణీ అడ్డగోలుగా ఉందన్నారు సుమారు 80 మందికి వ్యవసాయానికి అనుకూలం లేని విధంగా 10 సెంట్లు ఐదు సెంట్లు చొప్పున వారసులను జాబితా ఆమోదించారన్నారు. వారసుల జాబితా తయారు చేసేటప్పుడు వారసుడికి బదులు ఐదు, ఆరుగురు వారసుల పేర్లు పెట్టి అసైన్మెంట్ కమిటీకి పంపించి ఆమోదించాలన్నారు. అసైన్మెంట్ కమిటీ ఆమోదం మేరకు పట్టాలు పంపిణీ చేస్తే బాధితులు భూమి సాగు చేసుకోలేరన్నారు వ్యవసాయ భూమిని ఇంటి పట్టాల్లా ఐదు సెంట్లు నాలుగు సెంట్లు పంపిణీ చేస్తే ట్రాక్టర్ కూడా భూమిలో తిరగలేదన్నారు . గత అసైన్మెంట్ కమిటీ ఆమోదించిన భీమవరం బాధితుల భూమి కేటాయింపు పై మరలా గ్రామ సభ నిర్వహించి బాధితుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. భీమవరం బాధితులకు భూ పంపిణీ అభ్యంతరాలపై మరలా గ్రామసభ నిర్వహించాలని దళిత నేత నీలం నాగేంద్ర కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. జెసిని భీమవరం పంపి బాధితులు 145 మంది వారసుల జాబితాను భూమి కేటాయింపుపై తుది రూపం తెస్తామని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాల మహానాడు దారా అంజయ్య, కనకరాజు, కిషోర్ ఉన్నారు

వార్డుల వారీగా ఓటరు వెరిఫికేషన్


ప్రజాశక్తి-పొదిలి

మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని టిడిపి నాయకులు వార్డులవారీగా ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా పొదిలి పట్టణ, మండల అధ్యక్షులు ఆదేశాల మేరకు రెండో వార్డులో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని మంగళవారం దిగ్విజయంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మాజీ జడ్‌పిటిసి కాటూరి పెద్దబాబు గారు, బూత్ కన్వీనర్ జిలానీ (పంచాయతీ), పార్టీ లీగల్ సెల్ నాయకులు లాయర్ ఎంఎస్ బాషా, టిడిపి పొదిలి మండల ఐటి సలహాదారులు ఎం రబ్బానీ, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు(ఎంపి), కాటూరి శ్రీనివాసరావు మరియు వార్డ్ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని మల్లవరం గ్రామ పంచాయతీలోని 203వ బూత్ ఓటర్, హౌస్ వెరిఫికేషన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బూత్ కన్వీనర్ యర్రంరెడ్డి వెంకట కష్ణారెడ్డి క్లస్టర్ పరిశీలనకు వచ్చిన గొట్లగట్టు సర్పంచ్, క్లస్టర్ ఇంచార్జి సుఖదేవ్ (బూన్) యూనిట్ ఇన్చార్జి, ప్రకాశం జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, పొదిలి మండల ఐటీడీపీ ఇన్చార్జ్ ఏటి ఏడుకొండలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రకృతి వ్యవసాయంలో భూసారం పెంచటానికి రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన పెంచాలని ప్రకతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి సుభాషిణి తెలిపారు. మంగళవారం యర్రగొండపాలెంలో వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాల ఐసిఆర్‌పిలు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయానికి మించింది లేదని, ప్రస్తుతం రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగి.. రైతులకు గిట్టుబాటు ధరలు లేక అప్పులఊబిలో కూరుకుపోయారన్నారు. అటువంటి పరిస్థితుల నుండి రైతు మామూలు స్థితికి రావాలంటే గోఆధారిత వ్యవసాయమే చేయాలన్నారు. మూడేళ్ల పాటు కష్టపడితే తర్వాత ప్రకతి వ్యవసాయానికి భూమి అలవాటు పడి పెట్టుబడులు, ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయానికి ద్రవ జీవామతం, ఘన జీవామతం వంటి సేంద్రియ ఎరువులు, బీజామతం వంటి విత్తన శుద్ధి రసాయనం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కీటక నాశనులు తయారు చేసుకోవాలని, ప్రకతి వ్యవసాయంలో కేవలం దేశీ విత్తనాలనే విత్తుకొని సొంత విత్తన భాండాగారాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యంటి ఆంజనేయులు, యల్1లు మద్దయ్య, వెంకట్రావు, యల్2లు శ్రీనివాస్ గౌడ్, నాసరయ్య, మల్లెల కాశయ్య, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.



బీద మస్తాన్‌రావుతో కొండపి ఇన్‌ఛార్జి వరికూటి

బిఎంఆర్‌ను కలిసిన వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు

రాజ్యసభ సభ్యులు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బీదా మస్తాన్‌రావును కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు అంశాలను బిఎంఆర్ ప్రస్తావించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి జాగ్రత్తగా పని చేయాలని బీదా మస్తాన్‌రావు వరికూటి అశోక్‌బాబుకు, వైసీపీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైసీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, వైసీపీ నాయకులు వాకా బాలకష్ణారెడ్డి, సామంతుల రవికుమార్ రెడ్డి, గుండపురెడ్డి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గ్రంథపాలకురాలు లక్ష్మీనరసమ్మ

ప్రజాశక్తి-జరుగుమల్లి

విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకురాలు లక్ష్మీనరసమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా జరుగుమల్లిలో గ్రంథపాలకురాలు విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెడిటేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం గ్రంథపాలకురాలు కటికల ఝూన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడిటేషన్, స్టోరీ టెల్లింగ్, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కటికల ఝూన్సీ మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకునేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు మాక్స్ డిక్టేషన్, స్పోకెన్ ఇంగ్లీష్, డాన్స్ మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు వై వెంకటేశ్వరరెడ్డి, చిట్యాల రమణారెడ్డి పాల్గొన్నారు.

యాచకులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు



ఆహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలంలో విలేకరి కసుకుర్తి రామలింగం ఆర్థిక సహకారంతో టంగుటూరు యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యాచకులకు ఆహారం పంపిణీ చేశారు. మంగళవారం రామలింగం తల్లి కసుకుర్తి రాగమ్మ రెండో వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సింగరాయకొండ నుండి వల్లూరు వరకు జాతీయ రహదారి ప్రాంతాలలో ఉన్న అనాథలు, యాచకులకు భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, కురుకుంట్ల ప్రవీణ్, పొదిలి శశికుమార్, దేవరపల్లి రాము పాల్గొన్నారు.

దరిశిలో నూతనంగా సెంటర్ లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-దరిశి

దరిశిలో గడియారస్తంభం సెంటర్ వద్ద గతంలో వెలుగు కోసం వేసిన సెంటరు లైట్లు స్థానంలో కొత్తగా పోల్స్ వేసి కొత్త లైట్లు వేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వై.మహేష్ తెలిపారు. అక్కడ స్తంభాలను పుచ్చలమిట్టలో ఉన్న డివైజరు మీద కొత్త లైట్లు వేస్తున్నట్లు చెప్పారు. దరిశిలో ఉన్న అన్ని డివైజర్ల మీద నూతన పద్ధతిలో లైట్లు బిగిస్తున్నట్లు తెలిపారు.

పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-వేమూరు

వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పసుపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల టిడిపి ఆధ్వర్యంలో భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రేపల్లె మాజీ ఎంఎల్ఎ ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఓ పక్క వర్షాలకు పంటలు దెబ్బతిని అల్లాడుతున్న రైతులకు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కూడా లేకపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అనేక ప్రాంతాలలో పంట



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

పొలాల్లోనే పంటలు దెబ్బతిన్నాయని అట్టివాటిని పరిశీలించి నమోదు చేసి ఎకరాకు 30 వేలు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వాకా శేషుబాబు, మాజీ అధ్యక్షులు వై కరుణ శ్రీనివాసరావు, వేములపల్లి జగన్నదరవు, మోటూరి పుణ్య శ్రీనివాసరావు, తునుగుంట్ల సాయిబాబా, కుక్కల వెంకటేశ్వరరావు, యడ్ల జయశీలరావు, అధిన బసవపున్నయ్య, అనగాని ఏడుకొండలు, మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాద్, వమనపల్లి కోటేశ్వరరావు, డోలా, యారగళ్ల సాంబయ్య, సిరాజుద్దీన్, బట్టు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లో ప్రత్యేక సేవలు

ప్రజాశక్తి-కారంచేడు

ప్రతి నెల 9వ తారీఖున దేశవ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు జిల్లా ఆసుపత్రులలో గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కింద ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నట్లు కారంచేడు మండలం స్వర్ణ ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ హస్మప్రియ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం స్వర్ణ పిహెచ్‌సిలో ప్రత్యేక సేవలు అందించినట్లు ఆమె తెలిపారు. సాధారణ ప్రసవాలు జరిగేటందుకు ప్రతి రెండు, మూడు నెలల గర్భిణులకు, ఐదు ఆరు నెలల గర్భినులకు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వీరికి హెల్త్ ఎడ్యుకేషన్ ఇవ్వడం, హైరిస్క్ కేసులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఐరిస్ కేసులను మెరుగైన వైద్య సేవల కోసం ప్రాంతీయ, జిల్లా వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందించడం లక్ష్యంగా మంగళవారం స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హస్మప్రియ, ల్యాబ్ టెక్నీషియన్ బి శంకర్, స్టాఫ్‌నర్స్ బాల క్షీరవర్ధిని మల్లేశ్వరి, స్టాఫ్ నర్స్ జోత్స్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

13న పర్చూరులో లోక్ అదాలత్

ప్రజాశక్తి-పర్చూరు

దేశవ్యాప్తంగా ఈ నెల 13వ తేదీ జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పర్చూరు కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలేటి గంగమ్మ జాతరకు భారీ బందోస్తు

ప్రజాశక్తి-పిసిపల్లి



మాట్లాడుతున్న పోలీసులు

మండలంలోని పెదఅలవలపాడు సమీపంలో మంగళవారం రాత్రి జరుగుతున్న భగిరథ పాలేటి గంగమ్మ జాతరకు భారీ బందోస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కనిగిరి డిఎస్పీ ఆర్ రామరాజు ఆధ్వర్యంలో కనిగిరి సిఐ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో శాంతిభద్రతను కాపాడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి డిఎస్పీ ఇరువర్గాల రాజకీయ పార్టీలతోనూ, పాటకచ్చేరి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ తిరునాళ్లకు ఆరుగురు సిఐలు, 12 మంది ఎస్ఐలు, 150 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాలిసెట్-2023 ప్రవేశానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో ఈ నెల 10న పాలీసెట్ ప్రైవేట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలకు 3వేల388 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లాలో మొత్తం 15 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు హాజరవుతారు. అద్దంకి 5, బాపట్ల 5, రేపల్లె 4 కేంద్రాల్లో పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అద్దంకిలో 883 మంది, బాపట్ల 1848, రేపల్లె 657 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పాలీసెట్ జిల్లా కోఆర్డినేటర్ ఏవి ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తారు. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్లోకి అనుమతించరు. పెన్సిల్, పెన్ను, ప్యాడ్ మాత్రమే విద్యార్థులు వెంట తెచ్చుకోవాలని ఏవి ప్రసాద్ తెలిపారు. బాపట్లలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల జూనియర్ కళాశాల, బాపట్ల పబ్లిక్ స్కూల్, బాపట్ల ఫార్మసీ కళాశాల, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,848 మంది, రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, భాష్యం హైస్కూల్, ఎస్‌హెచ్‌బి డిగ్రీ కళాశాలలో మొత్తంగా 657 మంది, అద్దంకి ఎస్పీ బాలికల హైస్కూల్, ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 883 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశమన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

పంట మునిగింది.. పరిహారం ఇవ్వండి

ప్రజాశక్తి-కొల్లూరు: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి, కొల్లూరు మండల మాజీ ఎంపిపి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ నాయకత్వంలో కొల్లూరులో 'పంట మునిగింది–పరిహారం ఇవ్వండి' అనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కష్టాల్లో ఉన్న అన్నదాతకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 'పంట మునిగింది–పరిహారం ఇవ్వండి' అంటూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొల్లూరు మండల తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా కొల్లూరు మండలంలోని తెలుగు రైతు నాయకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను రిజిస్ట్రేషన్ చేయించుకోండి

ప్రజాశక్తి-పంగులూరు

మొక్కజొన్న రైతులంతా తమ పంటను వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం సుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, మొక్కజొన్న మద్దతు ధరలను ప్రభుత్వం 1,962 రూపాయలుగా కేటాయించిందని, ఈ ధరకు ప్రభుత్వం రైతులు దగ్గర నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తుందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఆ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోదలిచిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని కలిసి, ఈ నెల 13వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. రైతులు త్వరపడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే తర్వాత వీలు కాదని ఆయన అన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

ప్రజాశక్తి-అద్దంకి: అద్దంకి మండలంలో శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు మంగళవారం సూచించారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో డిఎస్‌పి ప్రసాదరావు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రధాన కూడళ్లలో పోలీస్ విధులు నిర్వహిస్తూ ప్రమాదాలను నియంత్రిస్తామని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో దృష్టి సారిస్తామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్ పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టు న్యాయమూర్తుల ఆదేశాల మేరకు అద్దంకి కోర్టు పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ కేసుల్లో రాజీ పడదగిన కేసుల్లో ఇరు వర్గీయులతో మాట్లాడి రాజీ మార్గానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సిఐ ఎం రోశయ్య, ఎస్ఐలు సమందర్ వలి, ఆదిలక్ష్మి, ఎస్‌బిఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంట్రన్స్ పరీక్షకు సర్వం సన్నద్ధం

ప్రజాశక్తి-మార్కాపురం

ఈ నెల 10న రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌బిటిఇటి నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు సర్వం సిద్ధం అయ్యింది. స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాల కో ఆర్డినేటింగ్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది. మార్కాపురంలో మొత్తం మూడు సెంటర్‌లలో 1,386 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు అవ్వనున్నారు. వీరిలో బాలికలు 371 మంది, బాలురు 1,015 మంది ఉన్నారు. స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో 636 మంది, జెడ్పీ బాయ్స్ హై స్కూల్‌లో 400 మంది, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో 350 మంది హాజవుతారు. ఈ పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షకు కో ఆర్డినేటర్‌గా నెల్లూరు పాలిటెక్నిక్ నుంచి పి ప్రభాకర్, జార్జి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా, ఎస్ రాజగోపాల్‌రెడ్డి స్పెషల్ అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఈ పరీక్షకు రిపోర్టింగ్ టైమ్ ఉదయం 10 గంటలు కాగా... 11 గంటల నుంచి ఒంటి గంట వరకు జరుగనుంది. ఈ మేరకు కోఆర్డినేటర్ అధ్యక్షతన చీఫ్‌లకు సమావేశం నిర్వహించారు.



రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో కుర్చీలు బహూకరిస్తున్న దృశ్యం

పాఠశాలకు కుర్చీల బహూకరణ

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు 20 ప్లాస్టిక్ కుర్చీలను మంగళవారం విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన అడుసుమల్లి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం, వారి కుమారులు శ్రీనివాసరావు, శేషగిరి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికల పాఠశాలను ఎంతో సమర్థవంతంగా ప్రధానోపాధ్యాయులు పివి రాఘవరావు నిర్వహిస్తున్నారని, ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాలలో మంచి ఫలితాలు సాధించారని, అటువంటి పాఠశాలకు కుర్చీలు బహూకరించడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు అడుసుమల్లి శ్రీనివాసరావు, శేషగిరిలను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి రాఘవరావు, విద్యా కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ స్కూల్‌కు 20 కుర్చీలు బహూకరించినందుకు రోటరీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, డాక్టర్ ఉబ్బా దేవపాలన, జాగర్లమూడి శివ కుమారి, పి ఆంజనేయులు, అళహరి హరిప్రసాద్, అద్దంకి లేవి ప్రసాద్, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, చందలూరి కృష్ణ, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తి సుబ్బయ్యకు ఆమంచి నివాళి

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని ప్రజలతో చురుకుగా ఉండే కత్తి సుబ్బయ్య చిన్నవయసులోనే అనారోగ్యంతో మరణించడం బాధాకరమని వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణ మోహన్ అన్నారు. మంగళవారం కడవకుదురులో సుబ్బయ్య మృతదేహానికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఒంగోలు డీపీవో నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కత్తి లాజర్, రామాంజనేయులు, వెంకయ్య, నారాయణ, అంకమ్మరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

దాసరి వెంకటేశ్వరరావు కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త దాసరి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో పార్టీ కార్యకర్త దాసరి వెంకటేశ్వరరావు(62) మరణించారు. మంగళవారం ఆయన కుటుంబాన్ని మంత్రి నక్కా పరామర్శించి, వారికి మనోధైర్యం చెప్పారు. ఆనంద్‌బాబుతో పాటు వేమూరు మండలం పెరవలి గ్రామ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడవకుదురులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని కడవకుదురు గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. రోగ నిర్ధారణ జరిగిన 40 మందికి ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్‌ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కిమ్స్ వైద్యులు రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ రాణి సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ది, దుర్యోధనుడిది ఒకే చరిత్ర

సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్రంలోని మోడీ బాటలోనే రాష్ట్రంలో జగన్ పాలన కూడా సాగుతోందని, జగన్‌దీ, నాటి దుర్యోధనుడిదీ చరిత్ర ఒకటే అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. దుర్యోధనుడికి దుర్మార్గులైన వందమంది సోదరులు ఉంటే, జగన్‌కు అంతకుమించిన ప్రభుత్వ సలహాదారులు ఉన్నారన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజల సంపదలు కొల్లగొట్టి విదేశాలకు పారిపోయిన 28 మంది గుజరాతీయులతో పాటుగా అదానీ, అంబానీలతో కలిపి 30 మంది అవినీతి ఆర్థిక నేరగాళ్లు మోడీ దత్తపుత్రులని వెల్లడించారు. మణిపూర్‌లో విధ్వంసానికి కారకులు బిజెపినే అని తెలిపారు. పార్లమెంటులో మోడీ, అదానీల బంధంపై ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీ శిక్ష వేయటమే కాకుండా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేసి, గంటల వ్యవధిలోని ఇంటిని కూడా ఖాళీ చేయించిన ఘనత మోడీదన్నారు. రాహుల్‌ని చూస్తే మోడీకి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. జగన్ కేవలం బటన్లను నొక్కే ముఖ్యమంత్రిగా మిగిలిపోయారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ తిరిగే భూ దందాల గురించి, ఇసుక, మద్యం మాఫియా, దళితులపై జరుగుతున్న దాడులు, మైనింగ్ మాఫియా, భూ కుంభకోణాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే దమ్ము జగన్‌కు ఉందా.? అని ప్రశ్నించారు. జగన్ పాలన సక్రమంగా ఉంటే నెల్లూరు రెడ్లు, జిల్లాలోని జగన్ బంధువు బాలినేని శ్రీనివాసరెడ్డి ధిక్కార స్వరం ఎందుకు వినిపిస్తారని ప్రశ్నించారు. రానున్న కాలంలో బిజెపి వ్యతిరేక పార్టీలన్నీ కూడగట్టి ఎన్నికలకు పోతామని తెలిపారు. కేంద్రంలో బిజెపికి, రాష్ట్రంలో వైసిపికి పతనం ప్రారంభమైందని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో

ఒక సీటుకు ముగ్గురు పోటీ

- ఉత్తమ ఫలితాల సాధనతో పెరిగిన డిమాండ్ - మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-కొల్లూరు, బాపట్ల జిల్లా

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ ఫలితాల కారణంగా గురుకులాల్లో సీట్లకు విపరీతమైన పోటీ ఏర్పడిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఇదివరకు గురుకులాల్లో ఉన్న సీట్లు భర్తీ కావడమే గగనమౌతుండగా ప్రస్తుతం ఒక్కో సీటుకు ముగ్గురు విద్యార్థులు పోటీ పడే పరిస్థితి వచ్చిందని వెల్లడించారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షా ఫలితాలను మంగళవారం బాపట్ల జిల్లా కొల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి నాగార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ లో ప్రవేశాల కోసం పరీక్షలను నిర్వహించడం జరిగిందని చెప్పారు. 5వ తరగతిలో మొత్తం 14,940 సీట్లు ఉండగా వీటి కోసం 55,485 మంది విద్యార్థులు పోటీపడ్డారని, 46,019 మంది విద్యార్థులు



ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ప్రవేశ పరీక్షలు రాసారని తెలిపారు. ఈ పరీక్షల్లో అనంతపురం కు చెందిన పర్వత జనవై 50 మార్కులకు గాను 50 మార్కులు సాధించి మొదటి ర్యాంకును సాధించారని వివరించారు. అలాగే జూనియర్ ఇంటర్ లో మొత్తం 14,000 సీట్లు ఉండగా వీటి కోసం 38,195 మంది విద్యార్థులు పోటీ పడ్డారని, 31,245 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసారని చెప్పారు. ఈ పరీక్షల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పొందూరు సూర్య నేత్ర 100 మార్కులకు గాను 92.5 మార్కులు సాధించి మొదటి ర్యాంకును దక్కించుకున్నారని వెల్లడించారు. ఎస్సీ గురుకులాల్లో గతంలో సీట్లు భర్తీ కాక మిగిలిపోయే పరిస్థితులు ఉండగా ప్రస్తుతం మాత్రం వీటి కోసం తీవ్రమైన పోటీ ఏర్పడటానికి కారణం గురుకుల విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ ఫలితాలే కారణమని మంత్రి నాగార్జున అభిప్రాయపడ్డారు. గురుకులాల్లో పాఠ్యాంశాల బోధనలోనూ, పరీక్షల నిర్వహణలోనూ అనేక మార్పులు చేసామన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఎస్సీ గురుకులాలకు చెందిన 1,370 మంది విద్యార్థులు 500 లకు పైగా మార్కులను సాధించారని చెప్పారు. జేఈఈ, నీట్ పోటీ పరీక్షల్లోనూ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటి అత్యధిక సంఖ్యలో ఐఐటి, ఎన్ఐటి, ఎంబీబీఎస్, డెంటల్ సీట్లను కూడా సాధించడం జరుగుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి, రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎన్.సంజీవరావు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలు కాపాడాలంటూ

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మున్సిపాలిటీకి చెందిన ఖాళీస్థలాన్ని అధికారపార్టీ నాయకుల సహకారంతో కొంత మంది అక్రమార్కులు ఆక్రమించుకొని కట్టడాలు సైతం చేస్తుంటే మున్సిపల్ అధికారులు స్పందించకపోవటం శోచనీయమని సిపిఎం నాయకులు మండిపడ్డారు. అక్రమంగా మునిసిపాలిటీ స్థలంలో నిర్మిస్తున్న రూముల నిర్మాణాలను వెంటనే మున్సిపల్ అధికారులు నిలిపివేయాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి డి సోమయ్య మాట్లాడుతూ ఖాళీ జాగా కనిపిస్తే చాలు కొంత ఆక్రమార్కులు గద్దల్లా వాలిపోతున్నారన్నారు. మార్కాపురం పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న (పాత అన్న క్యాంటీన్ వద్ద) ఉన్న సర్వే 494/బిలో 150 చదరపు చగజాలు గల ఖాళీ స్థలంపై కొంత మంది ఆక్రమార్కుల కన్ను పడిందన్నారు. అన్నుకున్నదే తడవుగా దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకొని నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. మున్సిపాలిటీ స్థలాల్లోనే



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

భవనాలు నిర్మిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇదే స్థలం ఆక్రమణకు గురయిన సందర్భంలో సిపిఎం పట్టణ కమిటీ మున్సిపల్ అధికారులకు తెలియజేయగా సదరు స్థలంలో నోటీస్ బోర్డు పెట్టి ఉన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డును సైతం అక్రమార్కులు పీకేసి.. అక్రమంగా భవనాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. అనంతరం కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు డీకేఎం రఫీ, పందిటి రూబెన్, జవ్వాజి రాజు, ఏనుగుల సురేష్‌కుమార్, షేక్ నన్నేసా, గుండారెడ్డి శేషరెడ్డి, వై.కాశమ్మ, జవ్వాజి మార్తమ్మ, పి.లోకేష్, కే విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, పి.ఆచారి పాల్గొన్నారు.



భోజనం అందజేస్తున్న డాక్టర్ జవహర్

జవహర్ ఆసుపత్రిలో భోజనం ఉచితం

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక జవహర్ నర్సింగ్‌హెూంలో రోగులకు ఇక నుంచి ఉచితంగా మధ్యాహ్న భోజనం వసతి కల్పిస్తున్నారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్, మాధవి దంపతుల వివాహ వార్షికోత్సవం సంధర్భంగా తమ ఆసుపత్రిలో చేరిన రోగులకు ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం ఉచితంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంగళవారం చీమకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చలువాది బదరినారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ జవహర్ దంపతులకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుభాకాంక్షలు తెలిపారు. నవ జాత శిశు చికిత్స మరియు సంరక్షణ విభాగంను నూతనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బి లక్ష్మిశారద,డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ ఎన్ తాతంనాయడు, లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, బాలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు వివక్షకు, లంచాలకు తావులేకుండా అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో అర్హత గల వారికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు తప్పకుండా అందాలన్నారు. రాష్ట్ర అధికారులు పాలనలో భాగస్వాములుగా చేయాలన్నారు. రాష్ట్రంలో అధికారులు పారదర్శకంగా ఉంటే సమస్యలు వెంటనే పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ, రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యల గురించి 'జగనన్నకు చెబుదాం' కాల్ సెంటర్ 1902కు ఫోన్ చేయాలన్నారు. రాష్ట్రంలో స్పందన కార్యక్రమం కంటే మిన్నగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి శివ జ్యోతి, సి.పి.ఓ భరత్ కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డి.పి.ఓ రమేష్, మత్స్యశాఖ జె.డి సురేష్,ఆర్.టి.ఓ చంద్రశేఖర్ రెడ్డి, డి.ఎస్.ఓ విలియమ్స్, డి.ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే నవరత్నాలు

రాష్ట్ర మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం, పుల్లలచెరువు

పేదల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెం గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలకతీతంగా, అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారని వివరించారు. పలు కాలనీల్లో స్థానికులు ఇళ్లు,



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పింఛన్లు కావాలని కోరారు. అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరారు. స్పందించిన మంత్రి సురేష్ అధికారులను పిలిచి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సచివాలయం ప్రారంభం..

మల్లాపాలెం గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి సురేష్ ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఇంకా అధికంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి మందా లాజరు, జడ్పీటీసీ వాగ్యా నాయక్, ఎంపిటిసి లింగంగుంట్ల రాములు, సర్పంచ్ బంగినపల్లి సుబ్బయ్య, వైసీపీ మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, రమణారెడ్డి, వైసీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, పిఆర్ డిఈఈ సుబ్బారెడ్డి, డిఎల్‌డిఓ సాయికుమార్, పిఆర్ ఏఈ నాగప్ప, ఎంపిడిఓ రాజ్యలక్ష్మి, తహశిల్దార్ దాసు, పంచాయితీ కార్యదర్శి పూర్ణయ్య, ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.